
సాక్షి
గుంటూరు
మంగళవారం । 25 । జూన్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



స్టూడెంట్ కిట్స్ పంపిణీ

తెనాలిఅర్బన్: ఐతానగర్ ఆది ఆంధ్ర ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్స్‌ను 39వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి పంపిణీ చేశారు.



బాబా సన్నిధిలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్

మంగళగిరి: పెదవడ్లపూడి సాయిబాబాను సోమవారం ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రచారక్ విజయ్ ఆదిత్య దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

జీఓ 117ను రద్దు చేయాలని మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యకు ఆటంకంగా ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. వెంకటరావు, బి. హైమారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశపెట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు.

జాతీయ రగ్బీ పోటీలకు నూతక్కి విద్యార్థి



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహ్మద్ సల్మాన్ జాతీయ రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కె.రజనీ నాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని గుంటూరు జిల్లా జట్టుకు కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈనెల 26 నుంచి 28 వరకు పూణే బాలివాడి స్టేడియంలో జరిగే జాతీయ రగ్బీ పోటీలలో పాల్గొననుండా పాఠశాల హెచ్ఎం రాజీవ్‌రత్న, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించినట్లు తెలిపారు.

యార్డుకు 45,769 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 45,769 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,696 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 18,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 19,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,563 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

28న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28న అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 ప్రముఖ సంస్థలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో 18 నుంచి 35 ఏళ్లలోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు రెజ్యూమ్, ఆధార్ జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 28న ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, కారాగారంలో నెలకొన్న లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు వివరించారు. ప్రతి నిందితుడూ న్యాయ సహాయం పొందకుండా ఉండరాదని, ప్రతి ఖైదీకీ ఉచిత న్యాయ సహాయం త్వరగా అందించేందుకు సూచనలు వెల్లడించారు. అనంతరం వంటశాలను తనిఖీ చేసి, ఖైదీలు భుజించే ఆహారాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలలో పాటించాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. భోజన, మౌలిక వసతులపై ఖైదీలతో మాట్లాడగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మహిళా ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు.

వనగూరిన ఆహ్లాదం

- పల్నాడు జిల్లాలో ఐదు ఎకో పార్కులు అభివృద్ధి
- గతేడాది పనులు మొదలుపెట్టిన కోటప్పకొండ, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల నగరవనాల పనులు దాదాపు పూర్తి
- ఒక్కో నగరవనం అభివృద్ధికి రూ.2 కోట్లు వ్యయం
- 50 ఎకరాల విస్తీర్ణంలో పార్కులు, ఓపెన్ జిమ్, యోగా, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు
- దాతల సహాయంతో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన

నగర వనం.. నయనానందకరం



కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం



ఆకట్టుకునే విధంగా స్వాగతద్వారం



కోటప్పకొండ నగరవనంలో చిల్డ్రన్ పార్క్



ఎకో పార్క్

సాక్షి, నరసరావుపేట: ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, పచ్చదనాన్ని అందించేందుకు ఏడాది కింద మొదలుపెట్టిన నగర వనాలు ఏర్పాటు దాదాపుగా పూర్తి కావొస్తున్నాయి. దేశంలో నగరాలు, పట్టణాలకు అనుకొని ఉన్న అటవీ భూముల్లో వనాలు పంపకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'నగరయోజన పథకం' కింద ఈ నగర వనాల పనులు జరిగాయి. అటవీ భూముల పరిరక్షణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నది వనాల అభివృద్ధి ముఖ్య ఉద్దేశం. అలాగే అడవులు, వన్యప్రాణాల సంరక్షణ గురించి ఈ వనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అడవుల ప్రాముఖ్యత తెలిపేలా ఈ వనాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ప్రతి వనంలో వాకింగ్ ట్రాక్, క్యాంటీన్, ట్రెక్కింగ్ సదుపాయం, ఓపెన్ జిమ్‌తోపాటు వారాంతాల్లో కుటుంబాలు, స్నేహితులతో వచ్చిన వారు సేదదీరేందుకు అనువుగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

రూ.2 కోట్లతో నగర వనాలు...

పల్నాడు జిల్లాలో కేంద్రం సహకారంతో అటవీ భూముల్లో నాలుగు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ కింద అభివృద్ధి చేస్తున్న నగరవనాలు మున్సిపాలిటీ పరిధికి 10 కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూములను ఎంచుకుంటారు. మొత్తంగా 50 హెక్టార్ల అటవీ భూమిని ఈ ప్రాజెక్టు కింద తీసుకోగా, అందులో తొలిదశలో 20 హెక్టార్లలో పనులు చేపట్టనున్నారు. దశలవారీగా మిగిలిన 30 హెక్టార్లలో సుందరీకరణ చేపడతారు. ఒక్కో నగర వనానికి హెక్టారుకు రూ.4 లక్షల చొప్పున గరిష్ఠంగా 50 హెక్టార్లకు రూ.2 కోట్ల దాకా కేంద్ర అటవీశాఖ నిధులు మంజూరు చేయనుంది.

తొలిదశ పనులు పూర్తి..

జిల్లాలో అటవీ భూముల్లో నరసరావుపేట మున్సిపాలిటీ సమీపంలోని కోటప్పకొండ, పిడుగురాళ్ల సమీపంలోని దేవరంపాడు, వినుకొండ సమీపంలోని వెంకుపాలెం, మాచర్ల వద్ద యర్రగొండపాలెం నగరవనాలను ఏర్పాటు చేశారు. వీటిలో తొలి దశ కింద ఇప్పటికే ఒక్కో నగర వనంలో రూ.1.4 కోట్లు ఖర్చు చేశారు. పట్టణ ప్రజలు సేద తీరేందుకు అవసరమైన అన్నివసతులు కల్పించారు. ఇందులో ఓపెన్ జిమ్, యోగాకేంద్రం, సాహసక్రీడలు, క్రీడా ప్రాంగణాలు, సేదదీరడానికి పార్కులు, చెక్కతో చేసిన బల్లలు ఏర్పాటు చేశారు. సందర్శకులు అవసరమైన తాగునీరు, క్యాంటీన్‌లు, వాష్‌రూంలు ఏర్పాటు చేశారు. తొలి దశ పనులు పూర్తికాగానే ఈ పార్కులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

రెండో దశలో రూ.60 లక్షలతో...

నగరవనాలలో రూ.1.4 కోట్లతో తొలిదశ పనులు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం మరో రూ.60 లక్షలను ఒక్కో వనానికి కేటాయించనుంది. వీటితో మొక్కలు నాటడంతోపాటు మరిన్ని వసతులను కల్పించేందుకు ప్రణాళికలను అటవీశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నగరవనాలలో దాతల సహకారంతో సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతానికి అనుకోని ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలలో పర్యటించే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నారు. మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం తీసుకోనున్నారు. వారి భాగస్వామ్యంతో పనులు చేపట్టనున్నారు. దీని ద్వారా పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది. పల్నాడు జిల్లాలో దైదా, గుత్తికొండబిలం, మన్నేపల్లి, సంజీవన కొండ, భట్రుపాలెంలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొండవీడు కోట సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నగరవనం అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇది సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

అటవీ ప్రాముఖ్యత తెలిపేలా...



జిల్లాలో నాలుగు నగర వనాల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో వనంలో రూ.1.4 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. మరో రూ.60 లక్షలతో రెండోదశ పనులు చేపడతాం. ఒక్కో నగరవనం రూ.2 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దనున్నాం. నగరవనాలతో ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడంతో పాటు అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించనున్నాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రజలు అందించే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారాల వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు తప్పక రావాలని తెలిపారు. ప్రతి అర్జీకి రసీదు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం వచ్చిన 120 అర్జీలను ఇన్‌చార్జి కలెక్టర్‌తోపాటు ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జెడ్పీ డెప్యూటీ సీఈఓ మోహన్ రావు, సీపీఓ శేషశ్రీ పరిశీలించారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



నా బిడ్డ మానసిక దివ్యాంగుడు. సదరం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే తాత్కాలికంగా ఇచ్చారు. శాశ్వత సదరం సర్టిఫికెట్ మంజూరు చేస్తే దివ్యాంగుల పింఛన్ వస్తుంది. న్యాయం చేయండి.

– ఇ.నాగమల్లేశ్వరి వరగాని, గుంటూరు

అర్థంతరంగా టీసీలు ఇచ్చారు

మేము హిందూ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాం. తొలి సంవత్సరంలో సుమారు 40 మంది ఫెయిల్ అయ్యాం. మా అందరికీ కళాశాల ప్రిన్సిపల్ మంజూశ్రీ టీసీలు ఇచ్చి కాలేజీకు రావద్దని చెప్పారు. అర్థంతరంగా ఎందుకని ప్రశ్నిస్తే ఎవరూ పట్టించుకోవడంలేదు. న్యాయం చేయండి. – హిందూ కళాశాల విద్యార్థులు

ఉద్యోగాలంటూ..!

గుంటూరు నగరంలోని రామిరెడ్డితోటకు చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగావకాశం ప్రకటన చూసి సంప్రదించాడు. అవతలి వ్యక్తులు పలు ప్రశ్నలు అడిగి నమ్మించి రూ.2 లక్షల వరకు పలు దఫాలుగా అతని నుంచి ఫోన్ పే చేయించుకున్నారు. ఆనక ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు.

పాతగుంటూరుకు చెందిన ఓ యువతి టెలిగ్రామ్ యాప్‌లో ఒక వెబ్‌సైట్ ప్రకటన చూసి రూ.3 లక్షల వరకు చెల్లించి చివరాఖరికి మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా కోకొల్లలు జరుగుతున్నాయి. కొందరు పోలీసులను ఆశ్రయిస్తుంటే.. చాలా మంది పరువుపోతుందని మిన్నకుండిపోతున్నారు.

- సైబర్ నేరగాళ్ల మాయ
- యువతే లక్ష్యంగా మోసాలు
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- స్టేషన్ మెట్లెక్కని కేసులెన్నో..!



డేటా ఎంట్రీ పేరిట మోసం.. బ్లాక్‌మెయిల్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): యువతే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. ఉద్యోగాల పేరిట గాలం విసిరి రూ.లక్షల్లో దోచేస్తున్నారు. పార్ట్‌టైం జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై ఆన్‌లైన్ నకిలీ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చదువుకున్న వారే. పలు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, ఇంజినీరింగ్ వంటి సాంకేతిక విద్యనభ్యసించిన నిరుద్యోగులు ఎక్కువగా మోసపోతుండడం గమనార్హం.

బయోడేటా సేకరించి కాల్స్

ప్రముఖ ఆన్‌లైన్ జాబ్ సెర్చ్ ఇంజిన్లలో ఇచ్చిన బయోడేటా ఆధారంగా నిరుద్యోగుల సమాచారం సేకరించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారికి మెయిళ్లు పంపిస్తారు. అవసరమైతే కాల్ చేస్తారు. ఇంటర్వ్యూ పేరుతో మోసం చేస్తారు. రకరకాల ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబడతారు. జాబ్ వచ్చేసినట్టే నమ్మిస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజులు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుంటారు.

వర్క్ ఫ్రం హోం పేరుతో..

చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసే వాళ్లు వీరినే ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించవచ్చని నమ్మించి నగదు దోచేసి నేరగాళ్లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేస్తున్నారు.

కొందరైతే డేటా ఎంట్రీ పని ఉందని, ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, చాలా ఎక్కువ డబ్బులిస్తామని నమ్మిస్తారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నకిలీలను ఇలా గుర్తించాలి..

- ఉద్యోగ ప్రకటనలన్నీ నిజం కావని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు వసూలు చేయవు.
- ప్రకటనల్లోని లోగోలు, లెటర్లను గమనించాలి.
- జాబ్ స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిళ్లు గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి
- నేరగాళ్లు ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తం కావాలి.
- 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.

చదువుకున్న వారు మోసపోతే ఎలా?

చదువుకున్న యువత మోసం పోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఉద్యోగాలకు డబ్బులివ్వడమేమిటీ అనే ఆలోచన కూడా ఉండడం లేదు. సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపడతున్నాం. వచ్చిన ప్రతి కేసునూ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. చాలామంది ఫిర్యాదులు చేయడానికి భయపడుతున్నారు. యువత జాబ్ ప్రకటనలకు స్పందించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. పూర్తి సమాచారం తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి. – నిచికేత్ షలేకే, ఏఎస్పీ, గుంటూరు

అప్పు ఎగ్గొట్టేందుకు దారిదోపిడీ నటన

- బంగారం పోయిందంటూ సినీఫక్కీలో నాటకం
- 20 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు
- బెడిసికొట్టిన మోసగాడి పన్నాగం
- ఎనిమిది మందిపై కేసు నమోదు
- 5 గురిని పట్టుకున్న తాడేపల్లి పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్, నకిలీ బంగారం



గాయాలపాలైన వీరాంజనేయులు

తాడేపల్లిరూరల్ : తీసుకున్న అప్పు ఎగ్గొట్టేందుకు ఓ వ్యక్తి నకిలీ బంగారంతో ఆడిన దారి దోపిడీ నటన బెడిసికొట్టింది. బంగారం పోయిందన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేవలం 20 గంటల్లోనే అసలు నిగ్గు తేల్చారు. మోసగాడి పన్నాగాన్ని బయట పెట్టారు. తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ప్రతాప్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో జాతీయ రహదారి వెంబడి కొలనుకొండ ఇస్కాన్ టెంపుల్ సమీపంలో రూ.కోటిన్నర విలువ చేసే బంగారం కలిగి ఉన్న బ్యాగ్‌ను ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఎత్తుకు పోయారని, తనకు తీవ్ర గాయాలు అయ్యాయని మంగళగిరి గండాలయ్యపేట 2వ లైన్‌కు చెందిన పసుపులేటి వీరాంజనేయులు, బంగారం వ్యాపారి గుర్రంకొండ రాముతో కలసి వచ్చి ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ ప్రతాప్, సిబ్బంది కొండలరావు, కల్యాణ్‌లతో కలిసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బావ పసుపులేటి వీరాంజనేయులు ఇచ్చిన డబ్బులు ఎగ్గొట్టేందుకు బావమరిది, బంగారం వ్యాపారి గుర్రంకొండ రాము ఈ నాటకం ఆడాడని తేలింది.

పక్కా ప్లాన్‌తోనే..

పసుపులేటి వీరాంజనేయులు, గుర్రంకొండ రాము బావబావమరుదులు. బంగారం వ్యాపారం చేస్తానంటే రాముకు వీరాంజనేయులు దఫదఫాలుగా రూ.90 లక్షలు ఇచ్చాడు. ఇటీవల డబ్బుల కోసం వీరాంజనేయులు ఒత్తిడి చేస్తుండడంతో ఎలాగైనా ఎగ్గొట్టాలని రాము పన్నాగం పన్నాడు. తన స్నేహితులైన మంగళగిరికి చెందిన రత్నం, బబ్లూతో చర్చించాడు. వారి సూచనలతో రాము రెండు కొత్త ఫోన్లు, సిమ్‌లు కొన్నాడు. ఒక ఫోన్ తన వద్ద పెట్టుకుని రెండోది రత్నంకు ఇచ్చాడు. హైదరాబాద్ నుంచి తాను బంగారం తీసుకొస్తున్నానని, విజయవాడ బస్టాండ్‌కు రావాలని వీరాంజనేయులుకు రాము ఫోన్ చేశాడు. విజయవాడ బస్టాండ్‌కు వెళ్లిన వీరాంజనేయులు ద్విచక్రవాహనంపై ఇద్దరూ మంగళగిరికి బయలుదేరారు. వెంటనే రత్నంకు మిస్డ్‌కాల్ ఇచ్చాడు. దీంతో వీరాంజనేయులు, రాములను గుంటూరుకు చెందిన ప్రసన్న, బబ్లూ ద్విచక్రవాహంపై వెంబడించారు. కొలనుకొండ వద్ద రాము కుడిచేతి భుజానికి ఉన్న నకిలీ బంగారం బ్యాగ్‌ను ప్రసన్న, బబ్లూ లాక్కుని వేగంగా పరారయ్యారు. ఈ సమయంలో పసుపులేటి వీరాంజనేయులు కిందకు పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంగారం పోయిందంటూ రాము రోడ్డుపై వీరంగం చేశాడు. బీట్ కానిస్టేబుళ్లు దీనిని గమనించి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాముపై అనుమానంతో తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. దీంతో ముఖ్య సూత్రధారి రాముతోపాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాము పోలీస్ స్టేషన్‌లోనే ఉండగా, రత్నం, బబ్లూ, శరత్‌బాబు, మహబూబ్ బాషాలను మంగళగిరి పానకాల స్వామి గుడి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రసన్నతోపాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద సెల్‌ఫోన్లతో పాటు కేజీన్నర నకిలీ బంగారం స్వాధీనం చేసుకున్నారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థలోని మిషన్ డైరెక్టర్ కార్యాలయం, కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం చేవూరు గ్రామంలోని గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా వేటపాలెంలోని వాకా రిసార్ట్స్, విజయవాడలోని పీబీ సిద్దార్థ డిగ్రీ కళాశాల, బాపట్ల జిల్లా శృంగాపురంలోని జెమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, దాచేపల్లి మండలం తంగెడలోని భవ్య సిమెంట్స్‌లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.2,800, గరిష్ఠ ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.

క్లుప్తంగా

గార్లపాడు వీఆర్వోపై కేసు నమోదు

కాకుమాను: ఓ వివాహితకు అసభ్యకర మెసేజీలు పెడుతూ మహిళను మానసికంగా హింసించిన ఘటనలో గార్లపాడు వీఆర్వోపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గార్లపాడుకు చెందిన ఓ వివాహిత తన కుమారుని జనన ధ్రువీకరణ పత్రం కోసం పదిరోజుల కిందట గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసింది. ఆమె భర్త కొద్దిరోజులుగా గ్రామంలో లేకపోవడంతో అదే అదునుగా తీసుకుని వీఆర్వో వివాహితకు ప్రతి రోజూ ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పోస్టు చేస్తున్నాడు. మనస్థాపానికి గురైన మహిళ సోమవారం తన కుటుంబ సభ్యులకు వీఆర్వో చేస్తున్న మెసేజ్‌ల గురించి తెలియజేసింది. కుటుంబ సభ్యులు గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి వీఆర్వోను నిలదీసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో గార్లపాడు వెళ్లి వీఆర్వోను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివాహిత ఫిర్యాదు మేరకు వీఆర్వోపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

కొండవీడుకోటకు కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లు



తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లు, ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంప్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌కు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం చారిత్రక కొండవీడుకోట సందర్శనకు బయలు దేరారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, తిరుపతి గ్రూప్‌లు, రాజస్థాన్ డైరెక్టరేట్‌లోని జోద్‌పూర్, ఉదయ్‌పూర్ గ్రూపులకు చెందిన క్యాడెట్లు, ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి మొత్తం 593 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువతలో జాతీయ సమైక్యత, పరస్పర అవగాహనను పెంచుకుంటారని చెప్పారు. కొండవీడుకోటలో ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందిన బోధకుల పర్యవేక్షణలో రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్ ట్రెక్కింగ్‌తో సహా అనేక రకాల సాహస కార్యక్రమాలలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సి.ఎస్.సిద్ధు, డెప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ. వీసీలు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

ఏఎస్పీ రమణమూర్తి


ఓ బాధితునితో మాట్లాడుతున్న ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని ఏఎస్పీ(పరిపాలన) రమణమూర్తి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణ న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఇల్లు రాయాలని వేధిస్తున్నారు

ఇంట్లో కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులు సరిగా చూడటంలేదు. ఇల్లు వారి పేరుపై రాయాలని వేధిస్తున్నారు. మమ్మలను పట్టించుకోవడంలేదు. అదేమని అడిగితే తమపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇంట్లో ఉండలేకపోతున్నాం. న్యాయం చేయండి.

– టి.నరసింహారావు, లక్ష్మీకాంతం, మంగళదాస్‌నగర్

రుణం పేరుతో మోసం..

పోస్ట లేకాలనీకి చెందిన ఓ కుటుంబం, బంధువులు నల్లపాడు, లాలుపురం, తెనాలి, విజయవాడ పరిసరాల్లో వెంచర్లు వేశామని నమ్మించారు. తక్కువ ధరలకే ప్లాట్లను ఇస్తామని చెబితే విడివిడిగా 8 మంది కలిసి కొనుగోలు చేశాం. శ్లాబ్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్లాట్‌లు అగ్రిమెంట్ చేసి, అనంతరం ప్లాట్‌లపై రుణాలు ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో అందరం సంతకాలు చేశాం. ఎంతకీ రుణాలు రాకపోవడంతో లాడ్జి కూడలిలోని ఓ బ్యాంక్‌లో ఆరాతీశాం. రూ.3.56 కోట్లకు స్థలాలు తనఖా పెట్టారని బ్యాంక్ సిబ్బంది బదులిచ్చారు. రుణం చెల్లించకపోతే వేలం వేస్తామని చెప్పారు. వెంచర్లు వేసిన వ్యక్తి ఆచూకీ లేదు. న్యాయం చేయండి

– బాధితుడు కాలేషావలి, గుంటూరు నగరం

కత్తెరతో హత్యాయత్నం

మా ఇంట్లోని విద్యుత్ పనులు సక్రమంగా చేయలేదు. ఆ విషయంపై అడిగేందుకు నా భర్త నాగేశ్వరరావు కొద్ది రోజుల క్రితం రాహుల్‌గాంధీనగర్ కొత్త మసీదు ఆరో వీధిలో ఉండే వ్యక్తి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో నా భర్తపై ఇద్దరు కత్తెరతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ వీడియో వైరలైంది. నా భర్తను వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తాత్కాలిక కేసులు నమోదు చేశారు. వారు బెయిల్‌పై బయటకు వచ్చి నన్ను బెదిరిస్తున్నారు. వారిపై హత్యాయత్నం కింద కేసు ఎందుకు నమోదు చేయలేదని అడిగితే, పోలీసులు హేళనగా మాట్లాడుతున్నారు.

– పసుపులేటి నాగమణి, యాదవబజార్, పాతగుంటూరు

250 గ్రాముల బంగారు వస్తువులు చోరీ

నా కుమార్తె గతనెలలో ఓటేసేందుకు హైదరాబాద్ నుంచి గుంటూరు వచ్చింది. ఓటేశాక, మరుసటి రోజు హైదరాబాద్ వెళ్లేందుకు తూర్పు వైపునున్న గుంటూరు రైల్వేస్టేషన్‌కు నేను స్కూటీపై తీసుకెళ్లా. కుమార్తెను స్టేషన్‌లో వదిలి వచ్చేసరికి స్కూటీ డిక్కీలోని 250 గ్రాములకుపైగా బంగారు వస్తువుల సంచి కానరాలేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదివ్వగా, కేసు నమోదు చేశారు. ఇటీవల నా గుర్తింపు కార్డులు ఏటుకూర్‌రోడ్‌లో పడి ఉండడాన్ని చూసి స్థానికులు సమాచారం అందించారు. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లా. అయినా కేసులో పురోగతి లేదు.

– కోటిరత్నం, గోరంట్ల

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు గౌరవ సత్కారం


సీఈఓ ఎ.మణిమేఖలైకు అవార్డు అందజేస్తున్న పీఎఫ్ఆర్‌డీఏ ప్రతినిధులు

కొరిటెపాడు: పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఈనెల 21న న్యూఢిల్లీలో నిర్వహించిన వార్షిక ఫెలిసిటేషన్ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌కు ప్రతిష్ఠాత్మక ఏపీవై అవార్డుతో సత్కరించినట్లు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.వీరారెడ్డి సోమవారం తెలిపారు. అవార్డును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ ఎ.మణిమేఖలై అందజేసి ప్రశంసించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీజీజీబీ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణారావు పాల్గొన్నట్లు తెలిపారు. చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును సీజీజీబీ ఉద్యోగులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల కృషి బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

శునకం తెచ్చిన తంట
వైద్య విద్యార్థుల ఘర్షణ

గుంటూరు మెడికల్: ఓ శునకం వలన గుంటూరు వైద్య కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థుల మధ్య వివాదం ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. అమరావతి రోడ్డులోని వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో ఓ వైద్య విద్యార్థి శునకాన్ని పెంచుకుంటున్నాడు. ఆ శునకం వైద్య విద్యార్థులు చదువుకునేందుకు ఎక్కువ సమయం గడుపుతున్న రీడింగ్ రూములో మూత్ర విసర్జన చేస్తుంది. ఈ విషయమై వైద్య విద్యార్థులు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. సోమవారం వైద్య విద్యార్థుల ఘర్షణ వ్యవహారంపై కళాశాల అధికారులు సమావేశమై గొడవ పడిన వైద్య విద్యార్థులను హెచ్చరించి పంపించి వేశారు.

తాడికొండలో భారీ వర్షం

తాడికొండ: తాడికొండలో సోమవారం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరటనిచ్చింది. ఇప్పటికే పంట పొలాల్లో మినుము, పత్తి విత్తనాలు విత్తి వరుణుడి కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదునుకు పదును వచ్చేలా కురిసిన వర్షం పంటకు మేలు చేస్తుందని చెబుతున్నారు. ఈ ఏడాది పత్తి, అపరాల పంటల విస్తీర్ణం భారీగా పెరగడంతో కూలీలకు ఉపాధి పెరగనుంది.

యువతలో బొల్లి సమస్య

- మానసిక క్షోభకు గురిచేస్తున్న సమస్య
- ఆధునిక శస్త్రచికిత్సలతో నివారణ
- నేడు వరల్డ్ విటిలిగో డే (బొల్లి నివారణ దినం)



గుంటూరు మెడికల్ : యువతను బొల్లి పట్టిపీడిస్తోంది. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఒకరు బొల్లి సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో రెండు శాతం ప్రజలు బొల్లి వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. జిల్లాలో 60 మంది చర్మ వ్యాధి వైద్య నిపుణులు ఉండగా రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు నుంచి పదిమంది బొల్లి సమస్యతో వస్తున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూ ఉండటంపై వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వరల్డ్ విటిలిగో డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

మెలనోసైట్స్ నశించటం వల్లే

వ్యాధి బారిన పడిన యువత మానసిక క్షోభకు గురవుతున్నారు. బొల్లి అనేది ఒక చర్మ సమస్య. ఈ సమస్యతో బాధపడేవారి చర్మంలో రంగును ఇచ్చే కణాలు (మెలనోసైట్స్) నశించడం వల్ల తెల్లమచ్చలు ఏర్పడతాయి. ఇది వ్యాధి కాదు. ఇది ప్రాణాంతకం కాదు, అంటు వ్యాధి కాదు. బొల్లిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవటం, అపోహలు ఉండటంతో సమస్యకు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నా వినియోగించుకోలేకపోతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే బొల్లి మిగతా శరీరానికి సోకే అవకాశం ఉంది. తొలుత తెల్ల మచ్చలు కనపడగానే వైద్యుని సంప్రదించాలి. గాయాలు తగలకుండా చూసుకోవాలి. ఆటో ఇమ్యూన్ డిజార్డర్స్‌కు తరచూగా చికిత్స తీసుకోవాలి. బొల్లికి పూతమందులు, ఫొటోథెరపీ, స్టరాయిడ్స్, మందులు, గ్రాఫ్టింగ్, ట్యాటూఇంగ్, లేజర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ఆధునిక చికిత్సతో చెక్‌పెట్టవచ్చు



బొల్లికి ప్రస్తుతం ఆధునిక చికిత్సలు, ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి 'ఆటోలోగస్ మెలనోసైట్ ట్రాన్స్‌ప్లాంటేషన్' చికిత్స అందుబాటులో ఉంది. ఈ ఆధునిక వైద్య చికిత్స ద్వారా బొల్లి మచ్చలను మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో తిరిగి సాధారణ స్థితికి తీసుకు రావచ్చు. ఈ చికిత్సలో శరీరంలో రంగును ఇచ్చే కణాలను (మెలనోసైట్స్) గ్రాఫ్టింగ్ ద్వారా ఉత్పత్తి చేసి తెల్లమచ్చలు ఉన్నచోట అమరుస్తారు. నూటికి 70 నుంచి 90 శాతం మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయి.

– డాక్టర్ మన్నె సింధూర, స్కిన్ స్పెషలిస్ట్, గుంటూరు

కొల్లిపరలో 21.2 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు పలు చోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా కొల్లిపర మండలంలో 21.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. మండలాలవారీగా.. మంగళగిరి మండలంలో 14.2 మి.మీ., దుగ్గిరాల 9.8, తాడేపల్లి 7.6, తెనాలి 6, ఫిరంగిపురం 5.4, గుంటూరు పశ్చిమ 2.8, తాడికొండ 2.8, తుళ్ళూరు మండలంలో 2.2 మి.మీ. చొప్పున వాన కురిసింది.

మాతృ మరణాలను నియంత్రిద్దాం


సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ కె.విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: మాతృ మరణాల నియంత్రణకు కృషి చేద్దామని, హైరిస్క్ గర్భిణులు నమోదైనప్పటి నుంచి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం సబ్ డిస్ట్రిక్ లెవెల్ మెటర్నల్ డెత్ రివ్యూ కమిటీ సమావేశం జరిగింది. విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మే నెలలో సంభవించిన మాతృ మరణాలపై సంబంధిత వైద్య అధికారులతో సమీక్షించారు. మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొల్లిపర సచివాలయంలో సంభవించిన మాతృ మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇది నివారించ దగ్గ మరణమేనని కమిటీ నిర్ధారించింది. ప్రతి గర్భిణిని సూపర్‌వైజర్‌కు ట్యాగ్ చేయాలని, గర్భస్థ దశలో వైద్యాధికారి దగ్గరకు పరీక్షలకు తీసుకు వెళ్లాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి, అవసరాన్ని బట్టి పైస్థాయి వైద్యశాలలకు రిఫర్ చేయాలన్నారు. పర్యవేక్షణ అన్ని దశలలో సక్రమంగా జరిగితే మాతృ మరణాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. సమీక్షలో కమిటీ సభ్యులు డాక్టర్ అరుణ, హెచ్‌ఓడీ గైనిక్ డాక్టర్ సుభాషిణి, ప్రొఫెసర్ గైనిక్ డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, అనస్థీషియా డాక్టర్ బుచ్చిబాబు, డిస్టిక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక రాయుడు, ప్రైవేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు, డీసీహెచ్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, డాక్టర్ కె. వి.సుబ్బరాజు, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, ఐసీడీఎస్, ఈవో సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, నేతలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ కోరారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా నగదు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది తుఫాన్, అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇవ్వవలసిన నష్టపరిహారాలతో పాటు సున్నా వడ్డీ పావలా వడ్డీ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ఇంకా పలు సమస్యలను వినతి పత్రంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.